క్లుప్తంగా

ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ

అరకురూరల్: పెదలబుడు పంచాయతీ పానిరంగిని గ్రామానికి చెందిన సమర్డి రామ్‌చందర్ (రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మృతుడి స్వగ్రామం పానిరంగిని సందర్శించి రామ్‌చందర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబం సభ్యులను పరామర్శించారు.వైస్ ఎంపీపీ రామన్న, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, సర్పంచ్ భాస్కర్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, నాయకులు సాంబ, రఘునాథ్, సోమేష్, ఏలేసు, శ్రీరాం, నొబో, రామ్మూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత రూ.5.46 కోట్ల మేర జమ

రాజవొమ్మంగి: మండలంలో వైఎస్సార్ చేయూత పథకం కింద 2, 916 మంది మహిళలకు సొమ్ము మంజూరైనట్లు స్థానిక వెలుగు ఏపీఎం ఆదినారాయణ తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 18, 750 చొప్పున మొత్తం రూ. 5, 46, 75, 000 ఆయా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. నాలుగవ విడత చేయూతగా ఈ సొమ్ము విడుదలైనట్టు చెప్పారు. అడ్డతీగలలో ఈనెల 13న నిర్వహించనున్న కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేయూత మీదుగా వైఎస్సార్ చేయూత పంపిణీ జరుగుతుందన్నారు. అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం, గంగవరం మండలాల్లోని డ్వాక్రా సంఘ సభ్యులందరూ ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి బోరు ఏర్పాటు



ఏరియా ఆస్పత్రి వద్ద బోరు వేయిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద తాగునీటి బోరును జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసింది. ఆస్పత్రి వద్ద రోగులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్రస్టు వ్యవస్థాపకులు వైద్యుడు జమాల్‌ఖాన్ మానవతా దృక్పథంతో తాగునీటి బోరు వేయించారు. దీనిపై ఆయనకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కాఫీ తోట దగ్ధం


చింతగొంది గ్రామం వద్ద దగ్ధమైన కాఫీ తోటను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీ చింతగొంది గ్రామంలో గిరిజన రైతులకు చెందిన కాఫీ తోట శుక్రవారం రాత్రి దగ్ధమైంది. చింతగొంది గ్రామానికి చెందిన వంతాల బాలకృష్ణ, వనగల శంకందొర అను ఇద్దరు గిరిజన రైతులకు సంబంధించిన రెండు ఎకరాలు కాఫీ తోటలు పూర్తిగా దగ్ధమైనట్టు సర్పంచ్ కొండబాబు, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి, గ్రామస్తులు తెలిపారు. దగ్ధమైన కాఫీ తోటను వారు పరిశీలించి, బాధిత కాఫీ రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన


ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రమేష్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సీఐ రమేష్ శనివారం పరిశీలించారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా , మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు జరిపించాలని చీఫ్ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, ఆర్‌వో కిరణ్‌లకు సూచించారు. సెంటర్ వద్ద పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షలు జరుగుతున్న అన్ని రోజులు నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సీఐ రమేష్ సూచించారు. ఆయనతో పాటు ఎస్‌ఐ రవీంద్ర ఉన్నారు.

మార్గం.. సుగమం

- కొయ్యూరు-గూడెం మండలాల్లో రోడ్ల మెరుగు
- పది గ్రామాల్లో జోరుగా రహదారి పనులు
- ఆనందంలో గిరిజనులు




యర్రగొండ గ్రామానికి వెళ్లేందుకు వేస్తున్న రోడ్డు


పాలసముద్రం గ్రామంలో రోడ్డు పనులు


బూదరాళ్ల పంచాయతీ చౌడుపల్లి గ్రామంలో రహదారి

కొయ్యూరు: మండలంలోని మారుమూల ప్రాంతాలన్నీ అభివృద్ధి వైపు పయనిస్తున్నాయి. ఒకప్పుడు అటవీ ప్రాంతాల మీదుగా ఆయా గ్రామాలకు చేరేవారు.. మండలంలోని యూ.చీడిపాలెం పంచాయతీలో యర్రగొండ నుంచి మర్రిపాకల, జెర్రిగొంధి వరకు అన్ని మారుమూల ప్రాంతాలు. అవన్నీ ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత కేంద్రాలు, అటు గూడెం కొత్తవీధి మండలంలో చిన అగ్రహారం, పెద అగ్రహారంతో పాటు మరికొన్ని మారుమూల గ్రామాల్లోనూ పరిస్థితి అంతే.. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయా ప్రాంతాల్లో కనీస అభివృద్ధి పనులు జరగలేదు. ఆయా గ్రామాలకు కాలినడకే శరణ్యంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. కోట్లాది రూపాయలతో మారుమూల గ్రామాల్లో రహదారుల నిర్మాణం జరిగింది. గ్రామాల రూపురేఖలు మారాయి. దశాబ్దాల తరబడి కనీస అభివృద్ధికి నోచుకోని అనేక శివారు గ్రామాల్లోనూ నేడు అభివృద్ధి కనిపిస్తోంది. యూ.చీడిపాలెం నుంచి యర్రగొండ వరకు 14 కిలోమీటర్లు రోడ్డు పనులు చేపట్టారు. దీంతో అక్కడ నుంచి మర్రిపాకల, జెర్రిగొంధి మీదుగా గూడెం మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఒకప్పుడు ఆయా గ్రామాలకు కాలినడకనే వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు రోడ్లు రావడంతో రవాణా సౌకర్యం మెరుగుపడిందని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. యర్రగొండ- యూ.చీడిపాలెం నుంచి ఎర్రగొండ వరకు త్వరలో మెటల్ రోడ్డు వేయనున్నారు. కాంట్రాక్టర్ ఇప్పటికే దీనికి అవసరమైన మెటీరియల్‌ను యూ.చీడిపాలెంలో ఉంచారు. ప్రస్తుతం జేసీబీతో కొన్ని పనులను చేస్తున్నారు. అదే విధంగా ఈ రహదారుల మధ్య రెండు చోట్ల కల్వర్టులు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. యూ.చీడిపాలెం నుంచి మర్రిపాకల వరకు రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. యూ.చీడిపాలెం పంచాయతీలో పలకజీడి నుంచి గంగవరం మీదుగా పాలసముద్రం వరకు, జంగాలతోట నుంచి వేమనపాలెం మీదుగా ఎర్రగొండకు వరకు, పలకజీడి నుంచి బంగారుబంద, సంగమవలస మీదుగా రేవులకోట వరకు రహదారుల పనులు ప్రారంభమయ్యాయి.

ఆనందంగా ఉంది



పంచాయతీలో శివారు గ్రామాల్లో కూడా రహదారులను ప్రభుత్వం నిర్మిస్తోంది. ఆయా గ్రామస్తుల రహదారి కల సాకారమైంది. యూ.చీడిపాలెంలో రహదారుల నిర్మాణానికి గత కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు. యర్రగొండ నుంచి మర్రిపాకలు, జెర్రిగొంది మీదుగా గూడెం మండలంలో అగ్రహారం గ్రామాలకు రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. శివారు గ్రామాలకుప్రభుత్వం రహదారులు కల్పించడం ఆనందంగా ఉంది.

– డి రమేష్, సర్పంచ్, యూ.చీడిపాలెం

శరవేగంగా పనులు

మండలంలోని మర్రిపాలెం, అగ్రహారం ప్రాంత రహదారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం యర్రగొండ, యూ.చీడిపాలెం తదితర ప్రాంతాల్లో రహదారులు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఉండేలా చూస్తున్నాం. గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రామకృష్ణ, జేఈ, కొయ్యూరు

అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలి


పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రమేష్, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలో గల పాతసుజనకోట గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి పండుగను పురస్కరించుకొని అమ్మవారి పేరిట పాకెట్ క్యాలెండర్‌ను శనివారం మండల కేంద్రంలో మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు వెంగడ రమేష్ చేతులమీదగా ఆవిష్కరించారు.సుజనకోట గ్రామానికి చెందిన వైజాగ్ హిందుస్థాన్ షిప్‌యార్డు ఉద్యోగి సమరెడ్డి బాలగంగాధర్ తిలక్, రోజారమణి దంపతుల ఆధ్వర్యంలో పాకెట్ క్యాలెండర్‌ను ముద్రించారు. ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న గంగమ్మ తల్లి ఉత్సవాలకు వచ్చే భక్తులకు పాకెట్ క్యాలెండర్లు అందజేయనున్నట్టు వారు చెప్పారు. గంగమ్మ తల్లి ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ సమరెడ్డి శంకర్‌రావు, కార్యదర్శి వెంగడ నీలకంఠం, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సూర్యనారాయణ, ధర్మారావు, రాధాకృష్ణ, నానిబాబు, మధన్, మోహన్, సదానందరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా 62 మంది గర్భిణులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వారిలో 16 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతో పాటు, అవసరమైన మందులు అందించారు. ఈ వైద్య శిబిరానికి వచ్చిన గర్భిణులు, సహాయకులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది వైద్య సేవలందించారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలోను వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో 52 మంది గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

బుడియాల సందడి


సంతలో సందడి చేస్తున్న బుడియాలు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట గ్రామంలో గంగమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో శనివారం వారపు సంతలో బుడియాలు సందడి చేశారు. ఈ నెల 11, 12తేదీల్లో జరిగే శ్రీ గంగమ్మతల్లి ఉత్సవాలను విజయవంతం చేయాలని బుడియాలు ప్రచార ర్యాలీ చేశారు. సుజనకోట మత్స్యగెడ్డ ఒడ్డున వెలసిన గంగమ్మతల్లికి సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం ఉత్సవాలు నిర్వహించి, మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఈ పండుగ సందర్భంగా గిరిజనులు బుడియాలు మాల ధరించి కర్రలు పట్టుకొని విన్యాసాలు చేస్తూ పాటలు పడుతూ గ్రామాల్లో తిరుగుతూ పండగపై ప్రచారం నిర్వహిస్తున్నారు. సుజనకోట సర్పంచ్ వి.రమేష్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు శంకర్‌రావు, నీలకంఠం, గ్రామ పెద్దలు సూర్యనారాయణ, గాసిరావు, సదానందం, రామ్మూర్తి, నానిబాబు, రాధాకృష్ణ, ధర్మారావు పాల్గున్నారు.

శివారు ప్రాంతాల్లో వర్షం.. చల్లబడిన వాతావరణం


లక్కవరప్పాడులో కురుస్తున్న వర్షం

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతాలైన బడదనాంపల్లి, లక్కవరప్పాడు, రాజుపేట పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంకాలం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొన్ని చోట్ల పిల్ల కాలువల్లో నీరు ప్రవహించింది. ఈ వర్షం మామిడి, జీడిమామిడి పంటలకు మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా ఎండతీవ్రతతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు ఒక్కసారి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు.

తండ్రి చెంతకు చిన్నారి


చిన్నారి శిరీష

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో తప్పిపోయిన చిన్నారి ఎస్‌ఐ రవీంద్ర చొరవతో తండ్రి చెంతకు చేరింది. పెదబయలు మండలం సీకరి గ్రామానికి చెందిన పాంగి జగ్గారావు, కుమార్తె శిరీష (2)తో కలిసి ముంచంగిపుట్టులో వారపు సంతకు వచ్చాడు. సామగ్రి కొనుగోలు చేస్తుండగా శిరీష తప్పిపోయింది. వెంటనే ఆమెను గుర్తించిన స్థానికులు పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఎస్‌ఐ రవీంద్ర ఆమె ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. సమాచారం తెలుసుకున్న తండ్రి పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. ఆమెను అతనికి ఎస్‌ఐ అప్పగించారు.

మా బతుకులు మార్చిన దేవుడు జగనన్న




ముంచంగిపుట్టులో పాన్‌షాప్ నిర్వహిస్తున్న గృహిణి రొబ్బ నూకలమ్మ

మాది నిరుపేద కుటుంబం. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఇందిరాకాలనీలో నివాసం ఉంటున్నాం. నేను గృహిణిని కావడం, నా భర్త కూలీ పనులు చేసి తెచ్చే డబ్బులు కుటుంబ పోషణకు సరిగ్గా సరిపోయేవి కావు. దీంతో చాలా సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. మాకు ఇద్దరు పిల్లలు వారిని పెంచడానికి సైతం కష్టంగా ఉండేది. మా కుటుంబానికి దేవుడిలా ముఖ్యమంత్రి జగనన్న నిలిచారు. ఆయన ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకోవడంతో నాకు రూ.18,750 మంజూరైయింది. దీంతో పాటు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.4వేలు వచ్చాయి. ఆ మొత్తంతో రూ.22,750లతో ఇంటి వద్దనే చిన్నపాటి పాన్ షాప్ పెట్టుకున్నా. ఏటా వైఎస్సార్ చేయూత డబ్బులు మంజూరవడంతో ఆ సొమ్ముతో మా పాన్‌షాప్‌లో మరిన్ని సరకులతో వ్యాపారాన్ని పెంచాను. మంచిగా జరగడంతో లాభాలు వచ్చాయి. నెలకు మొదటలో రూ.15 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం నెలకు సుమారు రూ.50వేలు పైగా లాభాలు వస్తున్నాయి. మా కుటుంబాన్ని నేనే పోషిస్తున్నాను. మా కుటుంబం నేడు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడిందంటే అంతా జగనన్న ప్రభుత్వం దయతోనే. జీవితాంతం ఈ ప్రభుత్వానికి నేను, నా కుటుంబం రుణపడి ఉంటాం.

– రొబ్బ నూకలమ్మ, వైఎస్సార్ చేయూత లబ్ధిదారు, ముంచంగిపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం

కనులపండువగా శివపార్వతుల కల్యాణం


ప్రత్యేకాలంకరణలో దుర్గాంబ సంగమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు


తరలివచ్చిన భక్తులు

కూనవరం: మండల కేంద్రంలో శబరి, గోదావరి సంగమతీరంలో వెలసిన శబరి దుర్గాంబ సంగమేశ్వర స్వామి వారి ఆలయం, కుమారస్వామి గుట్టపై కొలువైన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున 3గంటలకు శివపార్వతుల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణ వేడుకను వీక్షించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. శనివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది.

వైఎస్సార్‌సీపీ గెలుపే అందరి లక్ష్యం


తీగలవలస పంచాయతీ రాతులపుట్టులో పర్యటిస్తున్న పార్టీ నాయకులు

హుకుంపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.రామకృష్ణ అన్నారు. మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రంగశీల, తీగలవలస, తడిగిరి పంచాయతీల్లో వారు సందర్శించి కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు కొర్ర నాగరాజు, భీమలింగేశ్వరావు, నాయకులు సింహాచలం, రాజారావు, కన్వీనర్లు కృష్ణమూర్తి, సత్తిబాబు, కేశ్వరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని సాడేకు, భీరం, సింగర్భ, వాకపల్లి, కోరాపల్లి, ఉబ్బాసింగి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం పర్యటించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, మన్యంలో చేపట్టిన అభివృద్ధి పనులపై విస్తృతంగా ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. నాయకులు గంగరాజు, గబ్బాడి శేఖర్, బాలన్న, బుజ్జిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న పాడేరు మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు


కోరాపల్లిలో గ్రామస్తులతో పార్టీ నాయకులు

ఎన్నికలకు బూత్ కమిటీలు సిద్ధం

పాడేరు : రానున్న సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీలు సిద్ధంగా ఉన్నాయని మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు స్పష్టం చేశారు. పార్టీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు మండలంలోని గొండెలి గ్రామంలో గొండెలి, లింగాపుట్టు, డి.బొడ్డాపుట్టు, కించూరు, తోటలగొంది, బడిమెల పోలింగ్ బూత్ అధ్యక్షులతో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్ కమిటీలు, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పార్టీ అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.


గ్రామస్తులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తున్న కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ

గ్రామ సచివాలయల మండల కన్వీనర్ పలాసి కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పలాసి రాజేశ్వరి, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, సొమెలి లక్ష్మణరావు, గొల్లోరి నీలకంఠం, గ్రామ సచివాలయ కన్వీనర్లు పలాసి రామారావు, పాడి సింహాచలం, కొర్రా బాలరాజు, సొమెల సూర్యప్రకాశ్, గృహ సారథులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

చింతపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ అన్నారు. మండల కేంద్రంలో ముఠాదారి వీధిలో శనివారం గడప గడపకు సంక్షేమం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లోని జరిగిన అభివృద్ధిని, అందుతున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోనే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రామ వలంటీర్ వీరా, గృహసారథులు సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 14 మంది గైర్హాజరు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా జరుగుతున్న ఫస్ట్ ఇంటర్ పరీక్షలకు శనివారం 14 మంది గైర్హాజర్ అయినట్టు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ సలోమి తెలిపారు. మాథ్స్ పేపర్‌కు ఒకరు, జూవాలజీకి-8 మంది, హిస్టరీ సబ్జెక్టుకు ఐదుగురు విద్యార్థులు హాజరుకాలేనట్టు తెలిపారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 23 మందికి అందరూ హాజరైనట్టు పేర్కొన్నారు. మొత్తం 315 మందికి 301 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాశాని చెప్పారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు


బస్సు కిందకు దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

చింతూరు: మండలంలోని ఎర్రంపేటలో ఒడిశా జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో కూనవరం మండలం అభిచర్లకు చెందిన రవ్వ శివకుమార్‌కు గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు కల్లేరు నుంచి విజయవాడ వెళ్తున్న క్రమంలో ఎర్రంపేట వద్దకు రాగానే చింతూరు నుంచి మోతుగూడెం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో శివకుమార్‌కు తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సబ్ కలెక్టర్‌కు వినతి


సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన రైతులు

పాడేరు : జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బైపాస్ కోసం సేకరిస్తున్న భూములకు ఇస్తున్న నష్ట పరిహారాన్ని పెంచాలని గిరిజన రైతులు కోరారు. ఈ మేరకు పాడేరు సబ్ ధాత్రిరెడ్డిను మండలంలోని సుండ్రుపుట్టు, సేరుబయలు గ్రామానికి చెందిన పలువురు గిరిజన రైతులు శనివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం తమ విలువైన పంట పొలాలను కోల్పోతున్నందున ఆదుకోవాలని కోరారు.

రేపు సచివాలయం భవనం ప్రారంభం

కొయ్యూరు: మండలంలోని కంతారం గ్రామంలో గ్రామ సచివాలయ భవనాన్ని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సోమవారం ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో శనివారం తెలిపారు. దీంతో పాటు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులు హాజరుకావాలని కోరారు.